www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Rangareddy, Hyderabad, Karimnagar Circulated to: Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

రంగారెడ్డి | సంపుటి 01 | సంచిక: 17 | శనివారం | 13 జూన్, 2026



## విమానయాన భద్రతను బలోపేతం చేస్తాం

- త్వరలో అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై తుది నివేదిక
- ఈ ఘటనకు సంబంధించి ఎవరూ తప్పుడు ప్రచారాలు చేయొద్దు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

06




## మెటా సేవలకు అంతరాయం

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, మెసెంజర్, థ్రెడ్స్ సేవలు ప్రభావితం
- ఫీడ్ లోడ్ కాకపోవడం, సందేశాలు పంపడంలో సమస్యలు
- ప్రపంచవ్యాప్తంగా యూజర్ల ఫిర్యాదులు
- ఎలాంటి ప్రకటన చేయని సంస్థ

07

## నాటోకు అమెరికా షాక్?

- ఐరోపాలో సైనిక మద్దతు తగ్గించే దిశగా ట్రంప్ యంత్రాంగం ఆలోచన
- యుద్ధ విమానాలు, నిఘా వనరుల సంఖ్యలో కోతకు ప్రతిపాదనలు
- అమలైతే నాటో దాడి, నిఘా సామర్థ్యాలపై తీవ్ర ప్రభావం

06

## పవన్‌కు తెలంగాణలో

# పూర్తి స్వేచ్ఛ

### శాంతిభద్రతల కారణంగానే ఆయన సభకు అనుమతి నిరాకరణ

- మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామికం
- తెలంగాణపై కేంద్రం వివక్ష
- బీజేపీకి ఓట్ల చోరీ, సీట్ల చోరీ మాత్రమే తెలుసు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు తెలంగాణకు వచ్చేందుకు, వెళ్లేందుకు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు స్పందించారని పేర్కొన్నారు. శాంతి భద్రతల కారణంగానే ఆయన సభకు అనుమతి నిరాకరించినట్లు తెలిపారు. న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సీఎం, తాను ఎప్పుడూ హిట్లర్‌ను ఆదర్శంగా భావించలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్న ఎవరూ హిట్లర్‌ను ఆదర్శంగా చెప్పరని వ్యాఖ్యానించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు రాలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ సందర్భంగా తనను ఆయనే ఆప్యాయంగా



ఆలింగనం చేసుకున్నారని చెప్పారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టుల నిధుల విడుదల, రీజినల్ రింగ్ రోడ్ వంటి అంశాల్లో కిషన్ రెడ్డే అడ్డంకిగా మారారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాని వద్ద ఒక్కసారి అయినా గట్టిగా మాట్లాడారా అని ఆయనను ప్రశ్నించారు.

#### బీజేపీ కార్యకర్తలా..

బీజేపీకి ఓట్ల చోరీ, సీట్ల చోరీ మాత్రమే తెలుసని సీఎం విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమని, ఆమెపై ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకపోయినా నామినేషన్‌ను తిరస్కరించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. ఈ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు. బీజేపీ మహిళా వ్యతిరేక పార్టీ అని వ్యాఖ్యానించారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో భేటీ అయ్యారు.



# గ్రీన్‌సిగ్నల్

### సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు కీలక ముందడుగు

- చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మంత్రి ఉత్తమ్ భేటీ
- ఎన్‌వోసీ జారీపై కీలక చర్చలు
- సానుకూలంగా స్పందించిన చత్తీస్‌గఢ్ ప్రభుత్వం
- త్వరలో అనుమతులు వచ్చే అవకాశం

**ప్రజానావ, హైదరాబాద్:** గోదావరి నదిపై ప్రతిపాదిత సమ్మక్క-సారక్క బ్యారేజ్, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుల అనుమతుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో శుక్రవారం సమావేశమైన మంత్రి, ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు పంపేందుకు అవసరమైన అభ్యంతర రహిత ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని అధికారికంగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, అంశాన్ని సహానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ పరిణామం ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘంలోని అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన విభాగాల నుంచి ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. చత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ రాకపోవడంతో మాత్రమే డీపీఆర్ తుది ఆమోదం నిలిచిపోయిందన్నారు. ప్రాజెక్టు తరువాయి 2లో

## రాజ్యసభకు 24మంది ఏకగ్రీవం

- పెద్దల సభలో ఖర్గే, తరుణ్ చుగ్ సహా పలువురికి చోటు
- 27 స్థానాల్లో 24కు ఫలితాలు.. మరింత పెరిగిన ఎన్డీయే బలం

**న్యూఢిల్లీ:** రాజ్యసభకు ఈ నెల 18న జరగాల్సిన ఎన్నికలకు ముందే 27 స్థానాల్లో 24 స్థానాలకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తాజా ఫలితాలతో రాజ్యసభలో ఎన్డీయే బలం మరింత పెరిగింది. కాంగ్రెస్ ఐదు స్థానాలను దక్కించుకోగా, కర్ణాటకలో మూడు సీట్లు గెలుచుకుంది. బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు, గుజరాత్‌లో నాలుగు, మధ్యప్రదేశ్‌లో మూడు, రాజస్థాన్‌లో రెండు స్థానాలను కైవసం చేసుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లలో ఒక్కో స్థానం బీజేపీ ఖాతాలో పడగా, మేఘాలయలో ఎన్డీయే మిత్రపక్షమైన ఎన్‌పీపీ తరువాయి 2లో

# ఎస్ఐఆర్ భయంకరమైన భూతం



### ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి ఓటును కాపాడాలి.. బీఎల్‌ఏలు సైనికుల్లా పనిచేయాలి
- ఓట్ల చోరీ తర్వాత బీజేపీ సీట్ల చోరీకి దిగింది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజానావ, ఖమ్మం:** ఎస్ఐఆర్ ప్రక్రియ భయంకరమైన భూతం లాంటిదని, చట్టం పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగదారి ఇదేనని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ సమయంలో అధికారులు ఓట్ల మ్యాపింగ్ చేపడతారని, తరువాయి 2లో

# మీనాక్షి నటరాజన్‌కు షాక్!

### నామినేషన్ తిరస్కరణలో జోక్యం చేసుకోలేం: సుప్రీం

- ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడమే సరైన మార్గమని సూచన
- విచారణకు అర్హత లేదంటూ పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. మీనాక్షి నటరాజన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, ఆమెపై రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్షకు గురయ్యే క్రిమినల్ కేసులు లేవని, కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం, రిటర్నింగ్ అధికారి ఒకసారి నామినేషన్‌ను తిరస్కరించిన తర్వాత ఆ అంశంపై నేరుగా కోర్టు జోక్యం చేసుకోలేదని పేర్కొంది. ఈ తరహా వ్యవహారాల్లో ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడమే సరైన విధానమని సూచించింది. అలాగే, దీనికి విరుద్ధంగా గతంలో ఏవైనా తీర్పులు ఉంటే కోర్టు ముందుకు తీసుకురావాలని పేర్కొంటూ, ప్రస్తుత పిటిషన్ విచారణకు అర్హత లేదని తేల్చి కొట్టివేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ మీనాక్షి నటరాజన్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. అయితే ఆమె నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. తెలంగాణలో నమోదైన ఒక కేసు వివరాలను నామినేషన్‌లో వెల్లడించలేదని ఆరోపిస్తూ, రాజ్యసభ మూడో స్థానానికి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా నామినేషన్‌ను తిరస్కరించగా, కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మీనాక్షిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని వాదించింది. ఈ నేపథ్యంలో తన నామినేషన్ తిరస్కరణను సవాల్ చేస్తూ మీనాక్షి



నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తాజాగా అక్కడ కూడా ఆమెకు నిరాశే ఎదురైంది.



# వర్యతో కొత్త శకం

- వీడియో జనరేషన్ కోసం స్వదేశీ ఏఐ మోడల్ ఆవిష్కరణ
- టెక్స్ట్, ఫొటోలను వీడియోలుగా మార్చే సామర్థ్యం
- గ్లోబల్ మోడళ్ల కంటే 10 రెట్లు వేగం, తక్కువ ఖర్చు

**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అమెరికా, చైనా, యూరప్ దేశాలతో పోటీ పడుతూ భారత్ మరో ముందడుగు వేసింది. 'వర్య' పేరుతో రూపొందించిన స్వదేశీ వీడియో జనరేషన్ ఏఐ మోడల్‌ను అవతార్ ఏఐ సంస్థ శుక్రవారం న్యూఢిల్లీలో ఆవిష్కరించింది. ఇండియా ఏఐ మిషన్‌కు ఎంపికైన 12 స్టార్టప్‌లలో అవతార్ ఏఐ ఒకటి కావడం విశేషం. టెక్స్ట్ లేదా ఫొటోలను ఆధారంగా తీసుకుని వాటిని నాణ్యమైన వీడియోలుగా మార్చగల తరువాయి 2లో

## హెచ్-1బీ ఫీజుపై వెనక్కి తగ్గని ట్రంప్

- లక్ష డాలర్లకు పెంచిన నిర్ణయంపై ముదురుతున్న వివాదం
- ట్రంప్ ఉత్తర్వులను కొట్టివేసిన ఫెడరల్ కోర్టు
- తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్‌కు సిద్ధమైన అమెరికా న్యాయశాఖ

**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల రద్దు చేసినప్పటికీ, ఆ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు ప్రారంభించింది. గత ఏడాది సెప్టెంబరులో హెచ్-1బీ వీసా ఫీజును గణనీయంగా పెంచుతూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా తరువాయి 2లో



## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయాలి

- కాంగ్రెస్‌లోని 'బ్లాక్ షీప్'ను రాహుల్ గుర్తించాలి
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది వాటా తగ్గిస్తే ఊరుకోం
- ఫ్యూచర్ సిటీ కాదు.. రేవంత్ హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



## హిట్లర్ పాలన అంతం చేస్తాం

- వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయం
- కాంగ్రెస్ పోవడం, బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యం
- అధికారంలోకి రాగానే మేడిగడ్డకు పూర్తిస్థాయి మరమ్మతులు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

02

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

- **నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు**
- **హరీష్‌రావులా అవినీతి తమకు తెలియదని ఖండన**



**ప్రజానావ, సిద్ధిపేట :** సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేం దుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దా మంటూ హరీశ్‌రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు డా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## లారీ, కారు ఎదురెదురుగా ఢీ

- **ప్రమాదంలో ఇద్దరు మృతి**
- **మరో ముగ్గురికి గాయాలు**

**ప్రజానావ, జనగామ :** జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలోని నవాబుపేట వద్ద జనగామ – సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఘటనలో మరో ముగ్గురి కి తీవ్ర గాయాలయ్యాయి. కాజీపేటకు చెందిన ఎండీ ఇమ్రాన్, ఎండీ సుభాని, హనుమకొండకు చెందిన మాజీద్, సమీర్, ఖమ్మం జిల్లాకు చెందిన ఎండీ నూర్ బంధుమిత్రులు కలసి మిర్యాల గూడలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని కారులో తిరిగి వస్తుండగా జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ, కారు నవాబుపేట గ్రామం ప్రధాన కూడలి మూలమలుపులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు అమాంతం లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న సుభాని(30) అక్కడే మృతి చెందాడు. 108లో తరలిస్తుండగా ఇమ్రాన్(28) మృతి చెందాడు. మాజీద్, నూర్, సమీర్‌లను 108 సిబ్బంది జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- **లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు**
- **షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు**



**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

- **అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ**

**ప్రజానావ, హైదరాబాద్ :** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్–2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

# 25 నుంచి ఇంటింటి సర్వే గణన

- **సర్ ప్రక్రియకు పార్టీలన్నీ సహకరించాలి**
- **రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి**



**ప్రజానావ, హైదరాబాద్ :** ఈ నెల 25 నుండి జరగబోయే ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసి సర్వే కార్యక్రమం సజావుగా జరిగేవిధంగా అన్ని రాజకీయ పార్టీలను తెలంగాణ ఎన్నికల కమిషనర్ సి. సుదర్శన్ రెడ్డి కోరారు. శుక్రవారం బి ఆర్ కె భవన్ లోని సిఇఓ కార్యాలయంలో ఎస్ఐఆర్ పక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సిఇఒ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబి తాను తయారు చేసేందు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనికి అన్ని రాజకీయ పార్టీల వారు రాష్ట్రంలో సజావుగా నిర్వహించేందుకు తమ సహాయసహకారాలు అందజేయాలని సిఇఓ కోరారు. ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఈనెల 25 నుండి జులై 24 వరకు ఇంటింటి సర్వే గణన ప్రారంభం కానునందున బిఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందిస్తారని, వీటిని పూరించే విషయంలో రాజకీయ పార్టీలు వారి బిఎల్‌ఏ ద్వారా సరైన విధంగా ఎన్యుమరేషన్ పక్రియను పూర్తి చేసేం దుకు సహకారాలను అందించాలని, ఇందుకు సంబంధించి బిఎల్ఏలకు తగిన అవగాహన కల్పించాలని, ఎస్ఐఆర్‌పై ప్రజలకు ఎలాంటి అపోహలు, అనుమానాలు కలుగకుండా ప్రజలకు తమ వంతు బాధ్యతగా ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశంపై అవగాహన కల్పించాలని సూచించారు.

## యూరియా కోసం రైతుల రాస్తారోకో

**ప్రజానావ, కామారెడ్డి :** యూరియా కోసం బీర్కూర్ మండల ంద్రంలో అన్నదాతలు రాస్తారోకో చేశారు. యూరియా బస్తాల కోసం వివిధ గ్రామాలకు చెందిన రైతులు యాప్‌లో గురువారం సాయంత్రం బుక్ చేసుకున్నారు. ఈ మేర కు శుక్రవారం ఉదయం 7 గంటలకు బీర్కూర్ లోని గ్రోమోర్ ంద్రానికి రైతులు యూరియా కోసం వచ్చారు. 7 గంటల నుంచి 11 గంటల వరకు దుకాణం తెరవకుండా యూరియా ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన రైతులు బీర్కూర్ పోతంగల్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. యూరియా ఇవ్వకుండా సిబ్బంది కాలయాపన చేస్తున్నారంటూ ఆరోపించారు. పోలీసుల జోక్యంతో రాస్తారోకో విరమించారు.

# హిట్లర్ పాలన అంతం చేస్తాం

- **వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయం**
- **కాంగ్రెస్ పోవడం, బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యం**
- **అధికారంలోకి రాగానే మేడిగడ్డకు పూర్తిస్థాయి మరమ్మతులు**
- **హుజూరాబాద్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధి చేస్తాం**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**



**ప్రజానావ, జమ్మికుంట:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం చెందడం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం హిట్లర్ పాలన కొనసాగుతోందని విమర్శించిన హరీశ్‌రావు, ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని, ప్రజలంతా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే హుజూరాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని, రైల్ రోకో వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ఢిల్లీ వరకు తీసుకెళ్లిన ఘనత ఈ ప్రాంతానిదేనని కొనియాడారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిపోయిన పిల్లర్ల మరమ్మతులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టలేకపోయిందని విమర్శించిన ఆయన, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మేడిగడ్డకు పూర్తిస్థాయి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### డంపింగ్ యార్డ్‌ను అడ్డుకుంటాం: పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ పట్టణ సమీపంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే అంబేద్కర్ చౌరస్తాలో నిరవధిక ఆందోళన చేపడతామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే కల్వల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేయాలని, ఇది జమ్మికుంట, వీణవంక మండలాల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.

### కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ: జీవన్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ దీర్ఘకాల పోరాట ఫలితమేనని జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమ ని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌బాబు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్‌కుమార్, మాజీ చైర్మన్లు తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, పోడేటి రామస్వామి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ రంగ అభివృద్ధికి చర్యలు

- **సోలార్ పవర్ ప్లాంట్ శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి**



**ప్రజానావ, ఖమ్మం :** విద్యుత్ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం 33/11 వీ సబ్‌స్టేషన్ లో రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ కు, విద్యు త్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రానికి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో విద్యుత్ సమస్య లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. గత రెండున్నరేళ్లలో పాలేరు నియోజక వర్గంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనుల కోసం రూ.37.38 కోట్ల వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఇళ్లపై నుంచి వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా దశాబ్దాలుగా ఇబ్బంది లు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను ప్రభు త్వం పరిష్కరిస్తోందన్నారు. రూ.9 కోట్ల వ్యయం తో మూడు సబ్‌స్టేషన్ల పనులు చేపట్టినట్లు తెలి పారు. అర్హులైన వారికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయాలి

- **కాంగ్రెస్‌లోని 'బ్లాక్ షీప్'ను రాహుల్ గుర్తించాలి**
- **డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది వాటా తగ్గిస్తే ఊరుకోం**
- **ఫ్యూచర్ సిటీ కాదు.. రేవంత్ హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ అంశంపైనా ప్రత్యేక దర్యాప్తు బృందాలు (సిట్) ఏర్పాటు చేస్తోందని, అదే తరహాలో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వం వివాదంపై కూడా సిట్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే ఉన్నవారు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలకు ప్రతిపక్షాలను కారణం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్‌లో పదవులు, డబ్బుల వ్యవహారాలపై మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేసిన వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితులను బయటపెట్టాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టును నిలిపివేయడం వల్లే హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న నగర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఫ్యూచర్ సిటీ పేరుతో ఊహల్లో జీవిస్తున్నారని విమర్శించారు. ఇటీవల కురిసిన ఒక్క వర్షానికే నగరం జలమయమైందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. జూలైలో కేంద్ర ప్రభుత్వం మరోసారి డీలిమిటేషన్ బిల్లును తీసుకురావచ్చన్న సమాచారం తమకు ఉందని కేటీఆర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కాకపోయినా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్యను పెంచాలని సూచించారు. డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరిగితే సహించబోమని హెచ్చరించారు. దేశ అభివృద్ధికి దోహదపడుతున్న రాష్ట్రాలకు అన్యాయం చేయడం తగదన్నారు.

## రాజ్యసభకు 24మంది ఏకగ్రీవం

(మొదటిపేజీ తరువాయి)

ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాల్లో ఒక్కో సీటు ఎన్డీయేకు దక్కగా, తమిళనాడులో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను కోల్పోగా, ఒడిశాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్‌కు కూడా ఎదురుదెబ్బ తగిలింది. బీజేడీ నుంచి బీజేపీలో చేరిన దేబాశిష్ సమంతరాయ్ బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.





## హెచ్-1బీ ఫీజుపై వెనక్కి తగ్గని ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయాన్ని అమెరికా వాణిజ్య మండలి (యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్)తో పాటు డెమోక్రటిక్ పార్టీ నేతృత్వంలోని పలు రాష్ట్రాలు న్యాయస్థానంలో సవాల్ చేశాయి. వాదనలు పరిశీలించిన బోస్టన్ ఫెడరల్ కోర్టు, ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని పేర్కొంటూ దానిని కొట్టివేసింది. ఈ తీర్పుతో హెచ్–1బీ వీసాలపై ఆధారపడే పలు సంస్థలకు తాత్కాలిక ఊరట లభించింది. అయితే, కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ తాజాగా నోటీసు దాఖలు చేసింది. దీంతో హెచ్–1బీ ఫీజు పెంపు వ్యవహారం మరికొన్ని నెలల పాటు న్యాయపరమైన వివాదంగానే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యల నేపథ్యంలో వీసా ఫీజు పెంపు భారం నుంచి కంపెనీలకు పూర్తిస్థాయి ఉపశమనం ఇప్పుడే లభించే పరిస్థితి లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై రెం డు రాష్ట్రాల ఇంజినీర్లు సంయుక్త సర్వే నిర్వ హించారని, మరింత కచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని తెలిపారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.88 కోట్లు విడుదల చేసిన ట్లు పేర్కొన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాలకు చట్టబద్ధంగా నష్టపరిహారం చెల్లించేందుకు, అవసరమైతే ముందుగానే నిధులు డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

### సాగు, తాగునీరుకు ప్రయోజనం

సమ్మక్క–సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుం చి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్–2 పరిధిలో 4.40 లక్షల ఎకరాల ఆయక ట్టును స్థిరీకరించనున్నట్లు తెలిపారు. రామప్ప–పాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం కలగనున్నట్లు వివరించారు. గత రెండేళ్లుగా ఎన్‌వోసీ సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రస్తుతం రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో త్వరలోనే అనుమతి లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌వోసీ జారీ అయిన వెంటనే కేంద్ర జల సంఘం తుది పరిశీలన పూర్తిచేసి ప్రాజెక్టు అమలుకు ఉన్న చివరి ప్రధాన పరిపాలనా అడ్డంకి తొలగిపోతుందని మంత్రి తెలిపారు.



## వర్యతో కొత్త శకం

(మొదటిపేజీ తరువాయి)

సామర్థ్యం 'వర్య'కు ఉందని సంస్థ వెల్లడించింది. సాధారణంగా అంతర్జాతీయ ఏఐ వీడియో మోడళ్లు వీడియో రూపొందించేందుకు 50కు పైగా దశలను అనుసరిస్తే, 'వర్య' కేవలం నాలుగు దశల్లోనే ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపింది. అవతార్ ఏఐ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు స్రవంత్ అలూరు మాట్లాడుతూ, ఈ మోడల్ గ్లోబల్ ఏఐ ప్లాట్‌ఫారమ్‌ల కంటే దాదాపు 10 రెట్లు వేగంగా, తక్కువ వ్యయంతో పనిచేస్తుందని చెప్పారు. రూ.100 ఖర్చుతో 211 సెకన్ల నిడివి గల వీడియో రూపొందించవచ్చని, వీడియో తయారీలో సెకనుకు కేవలం 48 పైసలే వ్యయం అవుతుందని వివరించారు.

### స్థానికతకు అనుగుణంగా..

భారతీయ సంస్కృతి, పండుగలు, సంప్రదాయ దుస్తులు, ప్రాంతీయ ప్రత్యేకతలు, ఆహార అలవాట్లు, స్థానిక జీవన విధానాల ను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా వీడియోలు రూపొందించడం ఈ మోడల్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. విద్య, ఈ–కామర్స్, డిజిటల్ స్టోరీటెల్లింగ్ రంగాల్లో ఇది విస్తృతంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఏఐ మోడళ్ల అభివృద్ధిలో భారత్ వెనుకబడి ఉందనే విమర్శలకు 'వర్య' సరైన సమాధానమని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ అభిప్రాయపడ్డారు. స్వదేశీ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటే దిశగా ఇది కీలక అడుగని ఆయన పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ భయంకరమైన భూతం

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో ఓట్ల తొలగింపు ప్రక్రియపై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ కారణాలతో ఓటర్ల పేర్లను తొలగించే అవకాశం ఉందని, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఈ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓట్ల తొలగింపు ప్రయత్నాలను తిప్పికొట్టే బాధ్యత బూత్ లెవల్ ఏజెంట్లపైనే ఉందని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రంలో అధికా రంలో ఉన్న పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను ఉపయోగించుకునేందుకు ప్రయత్ని స్తోందని ఆరోపించారు. రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌ను ఎంపిక చేసిన తర్వాత ఆమెపై ఎఫ్ఐఆర్ ఉందనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించడం అన్యాయమని పొంగులేటి విమర్శించారు. గతంలో ఓట్ల చోరీకి పాల్పడిన బీజేపీ, ఇప్పుడు సీట్ల చోరీకి దిగుతోం దని ఆరోపించారు. సీబీఐ, ఈడీ వంటి సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థి పార్టీల ప్రజాప్రతినిధులను తమవైపు తిప్పుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# క్యాన్సర్‌పై మనోధైర్యమే గొప్ప ఆయుధం

- సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి డాక్టర్ రామకృష్ణ ప్రసాద్




**ప్రజానావ, కరీంనగర్ :** క్యాన్సర్ మహమ్మారిని జయించడానికి వైద్యంతో పాటు రోగికి ఉండే మనోధైర్యమే అత్యంత కీలకమైన ఆయుధమని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన వెల్లడించిన ముఖ్య వివరాలలో దేశంలోనే తొలిసారిగా హైపరైట్ టెక్నాలజీ యశోద ఆసుపత్రి రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో అత్యంత ఆధునికమైన హైపర్డైట్ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ఈ సరికొత్త మిషన్ భారతదేశంలో మరెక్కడా లేదని, కేవలం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు.

### దుష్ప్రభావాలు లేని ఖచ్చితమైన చికిత్స

ఈ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించి, కేవలం ఆ భాగాలకు మాత్రమే రేడియేషన్ అందిస్తారు. దీనివల్ల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన శరీర భాగాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయి. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రజల్లో దీనిపై అవగాహన పెంచేందుకు ఆసుపత్రి తరపున ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవంతమైన చికిత్సలు: ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అనేక మంది క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స అందించి, వారిని కోలుకునేలా చేశామని డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ వివరించారు. కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి ప్రతినిధి శ్రీకాంత్ మరియు మహేందర్ లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- ఇండ్ల పురోగతిని అధికారులు పరిశీలించాలి
- గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలి
- లబ్ధిదారులు సమస్యలు పరిష్కరించాలి
- జిల్లాలో 2,834 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలతో సమావేశం




**ప్రజానావ, సిరిసిల్ల :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 7,367 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని వెల్లడించారు. 5,798 ముగ్గు పోశామని, 5,014 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 4,362 ఇండ్లు గోడల లెవెల్ లో, 4,012 స్లాబ్ లెవెల్ లో, 2,834 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ.. పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రతి ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలని మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి.. ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇటుకలు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా.. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారి వివరాలు లబ్ధిదారులకు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయా లని సూచించారు. లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వినియోగించుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, సద్వినియోగం చేసుకునేలా చూడా లని ఎంపీడీఓలు ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలని, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాలకు ఎక్కడా ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.





# యువకుడి మృతితో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత

- యజమాని హత్య చేశాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- డీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాక్టర్ పనుల కోసం వచ్చిన సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటకు చెందిన వెంకటేశ్ శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సిరిసిల్ల మానేరు వాగులో వెంకటేష్ మృతదేహం లభించింది. ట్రాక్టర్ యజమానే హత్య చేశాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఒకరిపై మృతుని కుటుంబ సభ్యులు బంధు వులు దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారుల నుండి వ్యక్తిని కాపాడి పోలీసు వాహనంలో అక్కడి నుండి తరలించారు. ఆందోళన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన డంతో సిరిసిల్ల డిఎస్పి కె నాగేంద్ర చారి ఆధ్వర్యం లో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ సంద ర్భంగా ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

## ఫాజుల్‌నగర్ ఫీడర్‌కు నూతన బ్రేకర్ ఏర్పాటు

### విద్యుత్ సరఫరా మరింత బలోపేతం

**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ సెక్షన్ పరిధిలోని వట్టెంల సబ్‌స్టేషన్‌లో 11 కెవి ఫాజుల్‌నగర్ ఫీడర్‌కు నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు టీజీఎన్ పీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ ఆధునికీకరణతో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు విద్యుత్ అంతరాయాలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందనుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వేణుమాధవ్, డీఈ వెంకట రమణ, ఏడీఈ గంగాధర్, ఏఈ స్రవంతి, ఏడీఈ (సీఓ) రాజాలింగు, ఏఈ (సీఓ) శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్‌తో పాటు ఓ అండ్ ఎం సిబ్బంది పాల్గొన్నారు. టీజీఎన్ పీడీసీఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.




## జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారేకు నివాళి

### జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో సినారే వర్ధంతి

**ప్రజానావ, సిరిసిల్ల :** మేరు నగధీరుడు తెలంగాణ తొలి జ్ఞానపీఠ సాహితీ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి తెలుగు కవితను కడలి దాటించి విశ్వానికి తెలంగాణ హనుమాజిపేటని వినిపించి న మహనీయుడు అని రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి అధ్యక్షులు డా. జనాపాల శంకర య్య అన్నారు. శుక్రవారం జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో జనపాల శంకరయ్య అధ్యక్షతన సినారె వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జనపాల శంకరయ్య మాట్లాడు తూ డా. సినారె ఎప్పుడూ అందరి యెదలలోనుండి కదులుతూ ఉంటారన్నారు. ప్రధాన కార్యదర్శి వెంగల లక్ష్మణ్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఘన నివాళి కవులందరికి మార్గదర్శి అయిన డా. సినారేకు నివాళి సమర్పించామన్నారు. గుండెల్ని వంశీ తన కవితను ఆలాపించారు. ముఖ్య అతిథిగా పూర్వ గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, విశిష్ట అతిథిగా ఎనుగుల ఎల్లయ్య పాల్గొన్నారు.

## స్కూలు డ్రెస్సుల కుంభకోణం

### వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

**ప్రజానావ, హైదరాబాద్ :** స్కూల్ డ్రెస్సులను డామహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సీఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు.

# బీఎల్‌ఏలు సైనికుల్లా పనిచేయాలి

- ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి
- కాంగ్రెస్ శ్రేణులకు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్ పిలుపు




**ప్రజానావ, వేములవాడ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి ఓటు హక్కును కాపాడేందుకు సైనికుల్లా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్ పిలుపునిచ్చారు. శుక్రవారం వేములవాడలోని మహాలిం గేశ్వర గార్డెన్స్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎల్‌ఏ–2 శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్, పీసీసీ పరిశీలకుడు గోపిశెట్టి రాఘవేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచిన్ సావత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతోందని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం మరో ఉద్యమం అవసరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపుల విషయంలో బీఎల్‌ఏలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా, కొత్త ఓటర్ల నమోదు సక్రమంగా జరిగేలా బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్ మధు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

- ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై డీఈఓకు బీఆర్ఎస్వీ వినతి పత్రం
- బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, తాగునీటి సమస్యలు, మరుగుదొడ్ల కొరత, తరగతి గదుల సమస్యలు విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధిపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతదూరమైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మట్టే శ్రీనివాస్, అరెల్లి వినయ్, సదుల శేఖర్, అనుముల శివ, శశి, రాజు తదితరులు పాల్గొన్నారు.




# దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

### బంగారం, మొబైల్ ఫోన్ స్వాధీనం

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్ దోపిడీ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 3.6 గ్రాముల బంగారు గడ్డతో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్టకు చెందిన వొల్లెపు జ్యోతి ఫిర్యాదు మేరకు ఈ నెల 7న కేసు నమోదు చేశారు. పరిచయస్తుడి ఆహ్వానం మేరకు వేములవాడకు వచ్చిన ఆమెను నందికమాన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఆటోలో కొండ ప్రాంతానికి తీసుకెళ్లి బలవంతంగా మద్యం తాగించి, మెడలోని బంగారు పుస్తెలు, గుండ్లు, రెడ్‌మీ మొబైల్ ఫోన్‌ను అపహరించి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాలు, సమాచార సేకరణ ఆధారంగా ఈ నెల 10న వేములవాడ ఎస్ఆర్ఆర్ జాతర గ్రౌండ్ వద్ద బొడసు అశోక్, దండగుల ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. దోపిడీ చేసిన బంగారు పుస్తెల తాడును కరిగించి తయారు చేసిన బంగారు గడ్డను, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితు రాలు ప్రతిఘటిస్తే హత్య చేయాలనే ఉద్దేశంతో నిందితులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ రామ్మోహన్, కానిస్టేబుళ్లు గోపాల్, ఇమ్రాన్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

## మామిడిపళ్లు తిని అక్కా చెల్లెళ్లు మృతి

**ప్రజానావ, హైదరాబాద్ :** మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై నారాయణగూడ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మామిడి పండ్లు తిని భువనేశ్వరి(17), సంధ్య(10) తీవ్ర అస్వస్థకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక బీదర్ వాసులు వైజినాథ్, ఇందుమతి దంపతులు కొన్నాళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇందుమతి బంధువు రేణుక ఈనెల జలమండలి వద్ద రెండు జీల మామిడి పండ్లను కొనుగోలు చేసింది. ఆ పండ్లను ఇందుమతి, ఆమె నలుగురు కుమార్తెలు తిన్నారు. ఆపై వారంతా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. చికిత్స పొందుతూ అక్కాచెల్లెళ్లు భువనేశ్వరి(17), సంధ్య(10) మృతి చెందగా.. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు సు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మోడీ పాలనలో దేశం అభివృద్ధి

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వికాస్‌రావు




**ప్రజానావ, వేములవాడ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చెన్నమనేని వికాస్ మీడియా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా సంక్షేమం, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభి వృద్ధి, సుపరిపాలన రంగాల్లో చారిత్రాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన తెలిపారు. జనధన్ ఖాతాలు, ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, ఆయుష్మాన్ భారత్, పీఎం–కిసాన్, ముద్ర యోజన, ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరిందన్నారు. అలాగే జీఎస్టీ, యూపీఐ, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఆర్టికల్ 370 రద్దు వంటి కీలక నిర్ణయాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, రైల్వే అభివృద్ధి, వరంగల్ పీఎం మిత్ర టెక్స్టైల్ పార్క్, జహీరాబాద్ స్మార్ట్ సిటీ, రామగుండం ఎరువుల కర్మాగారం, బీబీనగర్ ఎయిమ్స్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర పురోగతికి తోడ్పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు,
నియోజకవర్గ కేంద్రాలు,
మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169

EDITORIAL



# బడిలోనే దేశ భవిష్యత్తుకు పునాది

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న వేళ, గత రెండున్న రేళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకున్న చర్యలపై ప్రభుత్వం సమీక్షించుకోవాలి. యంగ్ ఇండియా పాఠశాలల పేరుతో కొత్త ప్రతిపాదనలు ప్రకటించడం మాత్రమే కాకుండా, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను బలోపేతం చేయడం అత్యవసరం. అనేక చోట్ల హాస్టళ్లు కనీస సౌకర్యాలు లేక మృత్యు కుహరాలుగా మారిన పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. పాఠశాలలు, వసతి గృహాలను సమన్వయం చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, భద్రత, విద్యా వాతావరణం కల్పిస్తే ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్న సమాన విద్యావ్యవస్థకు బలమైన పునాది పడుతుంది. ఇందుకోసం భారీ పెట్టుబడులు అవసరం లేదు. ప్రస్తుతం విద్యా రంగానికి కేటాయిస్తున్న నిధులను సమర్థంగా వినియోగిస్తూ, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కార్యాచరణ అమలు చేస్తే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.

విద్య, వైద్యం పేదరిక నిర్మూలనకు, సామాజిక పురోగతికి కీలకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. విద్య ద్వారానే కుల, మత విభేదాలకు అతీతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్న ఆయన అభిప్రాయం స్వాగతించదగినదే. అయితే ఈ ఆలోచనలు ఎంతవరకు ఆచరణలోకి వస్తున్నాయన్నది ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న వేళ, గత రెండున్న రేళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకున్న చర్యలపై ప్రభుత్వం సమీక్షించుకోవాలి. యంగ్ ఇండియా పాఠశాలల పేరుతో కొత్త ప్రతిపాదనలు ప్రకటించడం మాత్రమే కాకుండా, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలను బలోపేతం చేయడం అత్యవసరం. అనేక చోట్ల హాస్టళ్లు కనీస సౌకర్యాలు లేక మృత్యు కుహరాలుగా మారిన పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. పాఠశాలలు, వసతి గృహాలను సమన్వయం చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, భద్రత, విద్యా వాతావరణం కల్పిస్తే ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్న సమాన విద్యావ్యవస్థకు బలమైన పునాది పడుతుంది. ఇందుకోసం భారీ పెట్టుబడులు అవసరం లేదు. ప్రస్తుత విద్యా రంగానికి కేటాయిస్తున్న నిధులను సమర్థంగా వినియోగిస్తూ, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కార్యాచరణ అమలు చేస్తే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. స్వేచ్ఛగా ఆడుతూ, పాడుతూ, చదువుకోవాల్సిన వయసులో ఎంతోమంది చిన్నారులు ఇప్పటికీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పుస్తకాల సంచితో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు, వ్యవసాయ పొలాల్లో బాల కార్మికులుగా మారుతున్నారు. కొందరు గొర్రెలు, పశువులు కాస్తుండగా, మరికొందరు వీధుల్లో యాచకులుగా కనిపించడం బాధాకరం. దీనికి ప్రధాన కారణం పేదరికం, నిరక్షరాస్యత, విద్య పట్ల అవగాహన లోపమే. ప్రతి బాలుడు బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యతను గ్రామస్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌లు, స్థానిక సంస్థలకు బాధ్యతలు అప్పగించి విద్యార్థుల చేరికపై ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, బడికి దూర మైన పిల్లలను గుర్తించి వారిని తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావడానికి స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలి. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నప్పటికీ అది మాత్రమే విద్యార్థులను ఆకర్షించడానికి సరిపోవడం లేదు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ, ఇతర విద్యా అవసరాలను పూర్తిగా ఉచితంగా అందించడంతో పాటు పాఠశాలల్లో నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పించాలి. కుల, మతాలకు అతీతంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలి. అప్పుడు తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడులపై మరింత విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. లక్షల రూపాయల ఫీజులు చెల్లించలేక అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. విద్యావ్యవస్థలో స్వతంత్రంగా ఆలోచించే పౌరులుగా ఎదగాల్సిన పిల్లలు ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల పరీక్షల ఫలితాల కంటే విలువలతో కూడిన విద్య, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఎంత ఉపాధ్యాయులపై ఉంటుందో, అంతే స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించే బాధ్యత అంతే ప్రభుత్వంపై ఉంది. బోధనేతర కార్యక్రమాల భారం తగ్గించి ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో బోధన పై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలి. నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన అంశాలు కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల వాస్తవ పరిస్థితులను సమగ్రంగా అంచనా వేసి, వాటి బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ బడి బలపడితే సమాజం బలపడినట్టే. ఇప్పటికీ ప్రభుత్వ విద్యపై విశ్వాసం ఉంచిన లక్షలాది కుటుంబాల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే, ఉపాధ్యాయులదే, సమాజం మొత్తానిదీ ఉమ్మడి బాధ్యత. సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే. దేశ భవిష్యత్తుకు పునాది బడిలోనే పడుతుందన్న సత్యాన్ని కార్యాచరణలో నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ, ఇతర విద్యా అవసరాలను పూర్తిగా ఉచితంగా అందించడంతో పాటు పాఠశాలల్లో నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పించాలి. కుల, మతాలకు అతీతంగా అందరికీ సమాన అవకాశా లు కల్పించే విధంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలి. అప్పుడు తల్లిదం డ్రుల్లో ప్రభుత్వ బడులపై మరింత విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డు కట్ట పడుతుంది.

ప్రభుత్వ బడి బలపడితే సమాజం బలపడినట్టే. ఇప్పటికీ ప్రభుత్వ విద్యపై విశ్వాసం ఉంచిన లక్షలాది కుటుంబాల నమ్మకాన్ని నిలబెట్టడం ప్రభుత్వానిదీ, ఉపాధ్యాయులదీ, సమాజం మొత్తానిదీ ఉమ్మడి బాధ్యత. సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- పెండింగ్ వేతనాలను చెల్లించాలి
- కలెక్టరేట్‌ను ముట్టడించిన జీపీ కార్మికులు



**ప్రజానావ, నాగర్ కర్నూల్:** రాష్ట్రంలోని గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తదితర డిమాండ్లతో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. అనంతరం వివిధ డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీరామ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12 790 గ్రామపంచాయతీలలో 60 వేల మంది ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ గ్రామీణ ప్రాం తాల లో ఎలాంటి అంటూ వ్యాధులు అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శిం చారు. పారి శుద్ధ్య కార్మికులు ఏళ్ల తరబడి పని చేసిన పనికి భద్రత పర్మినెంట్ కనీస వేతనాలు ఈఎస్ఐ పిఎఫ్ ప్రమాద బీమా లాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా పాలకులు తమ జీతాలు పెంచుకుంటూ ఒక్కసారి ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే జీవితకాలం పెన్షన్ తీసు కుంటూ పేదల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో పనిచేస్తున్న 53000 మంది గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెల 50 కోట్ల రూపా యల వేతనాలు బడ్జెట్ కేటాయిస్తున్నామని ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పిన ఇప్పటివ రకు గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వారి వ్యక్తి గత ఖాతాల్లోకి జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కింది స్థాయి కార్మికులనుపై స్థాయి ఉద్యోగులను ఉద్యో గులుగా చూస్తూ వేతనాల విషయంలో అసమానతలు చూపిస్తున్నారని అన్నారు. గత పాల కులు తీసుకొచ్చిన జీవో నెంబర్ 51ని సవరిం చాలని వందలా దిమంది గ్రామ పంచాయతీ కార్మికుల జీవితా లకు నష్టం చేసే మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయా లని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా గ్రామపం చాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే జూలై మొదటి వారం నుండి నిరవధిక సమ్మె చేపడు తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు పొదిల రామయ్య, ఇతర ప్రజాసంఘాల నాయకులు అంతటి కాశన్న, నాగరాజు, భక్తుల వెంకటేశ్వర్లు, లింగస్వామి పాల్గొన్నారు.

# పామాయిల్ తోటల సందర్శనకు రైతుల బృందం



**ప్రజానావ, సంగారెడ్డి:** రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంపొందించి, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించేందుకు సంగారెడ్డి జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు రెండు రోజుల ఆయిల్ పామ్ విజ్ఞాన యాత్రను అడిషనల్ కలెక్టర్ సంగీత జెండా ఊపి ప్రారం భించారు. జాతీయ ఆయిల్ పామ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వ హిస్తున్న ఈ విజ్ఞాన యాత్రకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి గల 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకెళ్లినట్లు జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వర రావు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ సంగీత రైతుల బృందం విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ముందుకు రావాలని సూచించారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ విజ్ఞాన యాత్రలో రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సంద ర్శించి సాగు విధానాలు, నాణ్యమైన మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగ పద్ధతులు, పంట దిగుబడులు, కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్ మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థా యిలో అవగాహన పొందనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి సమావేశమై వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంట ద్వారా పొందుతున్న ఆదాయం, ఎదుర్కొన్న సవా ళ్లు వాటి పరిష్కార మార్గాలపై ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ విజ్ఞాన యాత్ర ద్వారా రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై మరింత అవగాహన పెరిగి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టేందుకు ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో కార్మికుడి మృతి

**ప్రజానావ, సంగారెడ్డి:** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో అస్వస్థతకు గురై మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.80 లక్షల నష్టపరిహారం, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే. రాజయ్య తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి పరిశ్రమ యాజమాన్యంతో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయని వెల్లడించారు. రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం, మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ (25) సుమారు పది రోజుల క్రితం రెండో షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి మార్చారు. అక్కడ ఎనిమిది రోజుల పాటు చికిత్స పొందిన ప్రవీణ్ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిందని, కార్మిక శాఖ అధికారులు కూడా స్పందించలేదని రాజయ్య ఆరోపించారు. ప్రవీణ్ మృతి అనంతరం కుటుంబ సభ్యులు తమను సంప్రదించడంతో నిమ్స్ ఆస్పత్రి వద్ద పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. చర్చల అనంతరం బాధిత కుటుం బానికి రూ.80 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి అంగీకరించి ఒప్పందం చేసుకున్నట్లు రాజయ్య తెలిపారు. అంత్యక్రియల ఖర్చులకు రూ.లక్షను అందజేసిందని పేర్కొన్నారు.

# విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టరేట్ విద్యా చందనకు వినతి



**ప్రజానావ, పాల్వంచ :** కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ పరిధిలో ఉన్న వివిధ రకాల విద్యార్థుల సమస్యలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విద్యా చందనకు, విద్యాశాఖ అధికారులుకు బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం పాల్వంచ పట్టణ అధ్యక్షులు, గురువారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జూపెల్లి దుర్గాప్రసాద్, మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలు కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయని త్వరలో స్కూల్ ప్రారంభమవుతున్నాయని వచ్చేది వర్షాకాలం కావున స్కూల్లకు మరమ్మతులు చేయాలని, అదేవిధంగా, ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా, నోట్ బుక్స్ స్కూల్లో వద్దే కొనాలని ప్రైవేటు పాఠశాల యాజమాన్యం బెదిరిస్తున్నారని అని, ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కువగా పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చదువుతారని ఎందుకంటే వారు చదువుకోకపోయినా పిల్లల భవిష్యత్తు బాగుండాలని మెరుగైన విద్యను అభ్యసించాలని కోరుకొని, ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తే యాజమాన్యాలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సంవత్సరానికి ఒకసారి ఫీజులు పెంచుతూ అంతే కాకుండా బుక్ షాప్‌లో తక్కువగా దొరికే నోటుబుక్కులను, అధిక రేట్లకు అమ్ముతున్నారని, అదేంటి అని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోతున్నారని, ప్రైవేటు పాఠశాలల బస్సులు ఎటువంటి ప్రమాణాలు లేకుండా నడుపుతున్నారని అధికారులకు తెలియజేస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని పరిష్కారానికి కృషి చేయాలని విన్నపించారు. ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరగా సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా, ఉన్నటువంటి రేవంత్ రెడ్డి , ఫీజు నియంత్రణ కమిటీ వేసి ఫీజులను నియంత్రిస్తానని చెప్పి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు ఫీజు నియంత్రణ చేయలేదని, రేవంత్‌రెడ్డి విద్యార్థుల గురించి మాట్లాడుతూ, మేము అందరికీ అందించేది విద్య ఒక్కటే అని అదే రేపు మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. మరి ఇటువంటి మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు ఎందుకు ఫీజు నియంత్రణ చేయలేదని, స్కాలర్షిప్ బకాయిలు ఎందుకు విడుదల చేయలేదని, ప్రైవేటు పాఠశాలల్లో అధికంగా డబ్బులు దోచుకుంటున్న మౌనంగా ఎన్నుకున్నారని, గురుకులాలో తరచూ ఫుడ్ పాయిజన్లు అవుతున్న ఎందుకు పట్టించుకోవట్లేదని ఆయన ప్రశ్నించారు. త్వరితగతిన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే విద్యా శాఖ మంత్రి పదవి నుండి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున విద్యార్థుల సమస్యల పట్ల ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి పాల్వంచ పట్టణ ప్రధాన కార్యదర్శి కంచర్ల రామారావు, శ్రీకాంత్, మెహతాబ్, ముఖేష్, సతీష్, వాసుమల్ల గౌతం, తనీష్, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వహణపై శిక్షణ



**ప్రజానావ, పెన్ పహాడ్:** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజన నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నకిరెకంటి రవి విచ్చేసి మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరంగా, పరిశుభ్రంగా భోజనం అందించాలని సూచించారు. వంటకు ఉపయోగించే సరుకులు నాణ్యమైనవి, తాజాగా ఉండే వాటినే వినియోగించాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన స్టాక్, నాణ్యత నిర్వహణ రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన బిల్లులను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఏంఆర్సీ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. మండల నోడల్ అధికారి వస్రాం నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య, రవీంద్రబాబు, రిసోర్స్ పర్సన్ భద్రారెడ్డి, సీఆర్పీలు వహీద్ తదితరులు పాల్గొన్నారు.


# విద్యుత్ డీఈగా బాధ్యతలు స్వీకరించిన రాజునాయక్



**ప్రజానావ, నారాయణపేట:** నారాయణపేట జిల్లా విద్యుత్ విభాగం డివిజనల్ ఇంజనీర్ (డీఈ – టెక్నికల్) అధికారిగా బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజు నాయక్‌ను శుక్రవారం భారతీయ కిసాన్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక విద్యుత్ శాఖ ఎస్ఈ నవీన్ కుమార్ కార్యాలయంలో నూతన డీఈ రాజు నాయక్‌ను కిసాన్ సంఘం ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే అందజేసి, శాలు వాతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా వారు కోరారు. నూతన డీఈని సత్కరించిన వారిలో భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంత్ రెడ్డి, జిల్లా సహ కార్యదర్శి మహిపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శరణాయ స్వామి, నగర అధ్యక్షులు ఆకల వెంకటప్ప, ఉపాధ్యక్షులు గొడుగు లక్ష్మీ నారాయణ, బాపనపల్లి రాము, నరసింహారెడ్డి పగిడిమర్రి తదితరులు ఉన్నారు.

## విజ్ఞానం, నైపుణ్యాలతోనే మాదిగల అభ్యున్నతి

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గొల్లపల్లి జ్ఞానప్రకాష్



**ప్రజానావ, మక్తల్:** తరతరాలుగా విద్యా, ఆర్థిక రంగాల్లో వెనకబడిన మాదిగలు విజ్ఞానం, నైపుణ్యాలను ఆయుధాలుగా చేసుకుని అన్ని రంగాల్లో ప్రథమ స్థానానికి ఎదగాలని ఎమ్మార్పీఎస్ మక్తల్ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి జ్ఞానప్రకాష్ మాదిగ పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఖానాపూర్, కర్నె గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'గో టు విలేజ్' కార్యక్రమం, మాదిగల చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటంతో సాధించిన 9 శాతం ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను మాదిగలు విద్యా, ఉద్యోగాల్లో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కుల గణన సర్వే ప్రకారం తెలంగాణలో అత్యధిక పేదరికం, నిరక్షరాస్యత కలిగిన కులంగా మాదిగలే ఉన్నారని, ఈ వెనుకబాటుతనాన్ని మార్చడానికి ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జులై 7న నిర్వహించే మాదిగల జెండా పండుగను ప్రతి గ్రామంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కర్నె గ్రామ అధ్యక్షులు హెచ్. వెంకటయ్య, వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ పెద్ద రంగప్ప, బి. కృష్ణయ్య, జల్లి హనుమంతు, బి. నాగమ్మ, అక్షిత, నవీన, మణెమ్మ, లింగప్ప మాదిగ, మక్తల్ మండల కోశాధికారి జగ్గలి అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మధ్యాహ్న భోజనం

- సింగన్నగూడ సర్పంచ్, ఉపసర్పంచ్‌ల ఉదారత



**ప్రజానావ, గజ్వేల్:** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ములుగు మండలం సింగన్నగూడ సర్పంచ్ నాగరాణి స్వామి గౌడ్, చరణ్ రాజ్‌లు శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని భోజనాన్ని అందజేసినట్లు సర్పంచ్ నాగరాణి స్వామి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ఉపాధి హామీ కూలీల పాత్ర ఎంతో కీలకమైందని, వారి సంక్షేమానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మేరీ స్వర్ణ కుమారి, ఎంపీవో నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి, వార్డు సభ్యులు ఎలిగేటి స్రవంతి నాగరాజు, బయ్యారం రాజు, మన్నే ప్రేమలత స్వామి, బత్తుల రాణి పోచయ్య, బొర్రా ప్రవీణ్, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.




# యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

- మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి
- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన భట్టి విక్రమార్క మల్లు ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** సింగరేణిలో వివిధ కారణాలతో కొద్దికాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మి కుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవ కలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335మంది వారసులకు మంచిర్యాలలో శనివారం జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు భట్టి తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్స్టర్నల్ పోస్టులు ఉండగా 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని 35ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదు పాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వా టాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్సు చెల్లిస్తున్నామని, 2023–24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024–25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్సు పంపిణీ చేసినట్లు తెలిపారు.

### ఆసుపత్రుల ఆధునికీకరణ

సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖనిలో క్యాథ్ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గుబ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేదిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశానైనీబ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిలదొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

Singareni news

# పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం

- కలెక్టర్ రాజర్షి షా



**ప్రజానావ, ఆదిలాబాద్:** పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణకు నూతన నియమాలను అమలు చేస్తోందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాల య ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 'స్వచ్ఛ తెలంగాణ' ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే వర్మి కంపోస్టు బెడ్స్ (వానపా ముల ఎరువు తయారీ షెడ్డు)ను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహ ణ నియమాలను పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం, పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుధ్యం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక జాగ్రత్త చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి పచ్చ, నీలం, ఎరుపు, నలుపు రంగుల బుట్టల్లో సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వర్మి కంపోస్టు బెడ్స్కు తరలించి, నాణ్యమైన సేంద్రీయ ఎరువును తయారు చేస్తామని తెలిపారు. ఈ ఎరువు వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను లేదా చెత్తను తగలబెట్టడం, మురుగు కాలువలు, చెరువులు తదితర జల వనరుల్లో వ్యర్థాలను పడేయడం చట్ట రీత్యా నేరమని హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలు, మట్టి, ఇటుకలను రోడ్లపై పోసి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపార సంస్థలు, హోటళ్లు, మార్కెట్లు, బస్టాండ్ల నిర్వాహకులు తమ పరిసరాల్లో తప్పనిసరిగా డస్ట్బిన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్, సీసీలు కార్తీక్, యాసిన్, క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం



- వీర్లపల్లిలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పర్యటన

**ప్రజానావ, రామగుండం:** పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ శుక్రవారం ఉదయం 21వ డివిజన్ పరిధిలోని వీర్లపల్లి ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పాదయాత్ర నిర్వహిస్తూ స్థానిక ప్రజలను నేరుగా కలుసుకున్నారు. ప్రజల సమస్యలు, అవసరాలు, అభివృద్ధి పనులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ప్రతి వార్డు లో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. రామగుండం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పట్టణ ప్రగతి ప్రణాళిక ద్వారా వార్డుల వారీగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వ్యవస్థలు, పార్కులు, విద్యుత్ సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులున్నారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు



- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలో గత 15ఏళ్లలో అత్యధిక వరి, మొక్కజొన్న కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తిచేశామని తెలిపారు. సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. యా సంగి ధాన్యం కొనుగోళ్లు, మొక్కజొన్న కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ల ప్రవేశాలపై సమగ్రంగా వివరించారు. యాసంగి 2025–26 సీజన్కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93శాతం చెల్లింపులు పూర్తిచేసినట్లు తెలిపారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొంటూ, 2024–25 యాసంగి సీజన్లో 4.01 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరగగా, ఈసారి 4.35 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నట్లు తెలిపారు. సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2024–25 ఖరీఫ్లో 100 శాతం, రబీలో 95 శాతం, 2025–26 ఖరీఫ్లో 39 శాతం, రబీలో 8 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఫాల్ట్లో ఉన్న 10 రైస్ మిల్లులకు బకాయిలు చెల్లించి, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన అనంతరం మాత్రమే ధాన్యం కేటాయించినట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు రోజుకు సుమారు 600 వాహ నాలను వినియోగించామని, మొత్తం 1.15 కోట్ల గన్నీ సంచులు ఉపయోగించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో 6.90 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉండగా, అవసరాన్ని బట్టి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా అదనపు నిల్వ స్థలాన్ని వినియోగించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్లో 18,191 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, తొమ్మిది కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.63.40 కోట్ల విలువైన మొక్కజొన్న కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.14.84 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మొక్కజొన్న నిల్వ కోసం 29 వేల మెట్రిక్ టన్నుల స్థలాన్ని గుర్తించామని తెలిపారు. రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగినప్పటికీ పలు సవాళ్లు ఎదురయ్యాయ ని కలెక్టర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, అదే సమయంలో యూరియా నిల్వలు రావడం, ఎఫ్సీఐ గోదాముల్లో కార్మికుల కొరత వంటి సమస్యలను అధిగమించి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రైతులకు ఎక్కడా కోతలు పడకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మంథని ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన మూడు లారీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సంబంధిత కొనుగోలు కేంద్రాలపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్తో రాజకీయ లబ్ధికి బీజేపీ ప్రయత్నం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



**ప్రజానావ, హనుమకొండ:** ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తూ ఓటర్ల జాబితాల ద్వారా రాజకీయ ప్రయోజనం పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆరోపించారు. హనుమకొండ అంబేద్కర్ భవన్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల మద్దతుతో గెలిచే పరిస్థితి లేకపోవడంతో బీజేపీ ఓటర్ల జాబితాలను రాజకీయ ఆయుధంగా ఉపయోగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరిగాయని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, బూత్ అధ్యక్షుడు అప్ర మత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఓటువేసి నవారికి కూడా జాబితాలో పేరు లేకపోయే పరిస్థితులు తలెత్తే అవ కాశముందని, ఓటు హక్కు కోల్పోవడం అంటే రాజ్యాంగబద్ధమైన హక్కును కోల్పోవడమేనని ఆమె పేర్కొన్నారు. రాజ్యసభకు కాంగ్రెస్ తరఫున మహిళను పంపే ప్రయత్నంలో మీనాక్షి నటరాజ్కు చిన్న కారణాలతో అడ్డంకులు సృష్టించడం బీజేపీ మహిళలపై ఉన్న వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ పోరాటం**

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పోరాడుతున్నారని, అది పార్టీ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని స్పష్టం చేశారు. డా.బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కా పాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాబోయే మూడు నెలల పాటు బీఎల్ఏలు, బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, అన్యాయంగా తొలగించిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బూత్ స్థాయిలో బలోపేతమే పార్టీ విజయానికి తొలి అడుగని పేర్కొన్నారు. అనంతరం కడియం కావ్య రూపొందించిన బూత్ లెవల్ ఏజెంట్ల సంక్షిప్త సమాచార హ్యాండ్ బుక్ను ఆవిష్కరించి నాయకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శంకర్ నాయక్తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ డిమాండ్

**ప్రజానావ, సిరిసిల్ల:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆందోళన చేపట్టింది. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల కార్మికులంతా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడం రమణలు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రతి నెల1నే వేతనాలకు అందజేయాలని, రూ.50 కోట్లు బడ్జెట్లో కేటాయిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన అమలు చేయాలన్నారు. వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పంచాయతీ సిబ్బందిని 2వ పిఆర్సీలో గుర్తించాలనీ, జీఓ నెం.51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పాత కేటగిరీలను కొనసాగించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలనీ, 4 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2025లో 6 మాసాల పాటు కార్మికులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం సేకరించిందని, ప్రస్తుతం పెరిగిన జనాభా ప్రకారం అవసరాల కోసం నియమించుకున్న కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు. 60 సంవత్సరాలు పైబడి, అనారోగ్యం పాలైన, సహజ మరణం, ప్రమాదంలో మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు మొదటి ప్రాధాన్యతనిచ్చి పని కల్పించాలని కోరారు. వారసులు లేని కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యాలను కల్పించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కుటుంబ సభ్యుల పేర్లను ఇప్పటికైనా ఆన్లైన్లో నమోదు చేసి వేతనాలు చెల్లించాలని, కార్మికులపైన వేధింపులు, ఇష్టానుసారంగా విధుల నుంచి తొలగించడానికి మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అన్నల్దాస్ గణేష్ , గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, అక్కల అంజయ్య, లొకిని శ్రీనివాస్, కంసాని రవీందర్, సందేలా మహేష్, వరుకొలు మల్లయ్య, బత్తుల రమేష్, బెజగం శేఖర్, బాబు మర్రిగడ్డ, నాగరాజు కొత్తపెల్లి, అశోక్ కట్కూరు, రామదాస్ కార్మికులు పాల్గొన్నారు.




# మారుపేర్ల డిపెండెంట్లకు తక్షణమే ఉద్యోగాలివ్వాలి

- పదేండ్లుగా అరిగోస పెడుతున్న ప్రభుత్వం
- ఉద్యోగాలు ఇవ్వకుంటే ఆమరణ దీక్ష
- డిప్యూటీ సీఎం సభను అడ్డుకుంటాం
- మారుపేర్ల బాధితుల హెచ్చరిక

**ప్రజానావ, రామగుండం:** సింగరేణి సంస్థలో మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని బాధిత కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. లేదంటే కోల్బెల్ట్ ప్రాంతంలో శనివారం 13న శ్రీరాంపూర్ ఇందారంలో జరగనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభను అడ్డుకుంటామని హెచ్చరించాయి. కారుణ్య ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కోసం డిప్యూటీ సీఎం భట్టి శనివారం శ్రీరాంపూర్లో జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బాధిత కుటుంబాలు శుక్రవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లో మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా తమ సమస్యను పట్టించుకోకపోతుండడం అన్యాయమని మండిపడ్డారు. న్యాయమైన తమ సమస్య పరి ష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని, అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని ప్రకటించారు. గత పది సంవత్సరాలుగా మారు పేర్ల బాధితులను విజిలెన్స్ విచారణ పేరిట ఉద్యోగాలు తమ జీవితాలతో సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వంచెలగాటం ఆడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీగా మారు పేర్ల బాధితులకు న్యాయం చేసి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఉద్యోగాల ఊసే లేదనీ అన్నారు. స్థానిక రామగుండం ఎమ్మెల్యే మారుపేర్ల బాధితుల గురించి అసెంబ్లీలో చర్చించానని గొప్పలు చెప్పుకోవడం సరిపోతుందని, ఉప ముఖ్యమంత్రి గోదావరిఖనిలో జరిగిన సభలో మారుపేర్ల బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారని, తర్వాత తాము ఎమ్మెల్యేను మంత్రుల ను కార్మిక సంఘం నాయకులను ఎన్నిసార్లు కలిసి విన్నవించిన ఫలితం లేదన్నారు. 400 మంది డిపెండెంట్లకు 13న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉద్యోగ నియామకాలు ఉత్తర్వులు అందజేరానున్నారని, తమకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే ఉప ముఖ్యమంత్రి చిరాకుపడి ఎమ్మెల్యే వచ్చిన వినతిపత్రం చింపారని తన వద్దకు రావద్దని అంటున్నారని వారు ఆవేదన చెందారు. నేడు జరిగే ఉప ముఖ్యమంత్రి సభను అడ్డుకుంటామని అవసరమైతే ప్రాణ త్యాగానికి వెనుకాడమని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మారుపేర్ల బాధితుల సంఘం నాయకులు శ్రవణ్ గౌడ్, సదానందం, రాజయ్య, రమేష్ తదితరులున్నారు.



# నాటోకు అమెరికా షాక్?

- ఐరోపాలో సైనిక మద్దతు తగ్గించే దిశగా ట్రంప్ యంత్రాంగం ఆలోచన
- యుద్ధ విమానాలు, నిఘా వనరుల సంఖ్యలో కోతకు ప్రతిపాదనలు
- అమలైతే నాటో దాడి, నిఘా సామర్థ్యాలపై తీవ్ర ప్రభావం



**వాషింగ్టన్:** ఇరాన్ యుద్ధ నేపథ్యంలో అమెరికాకు పూర్తిస్థాయిలో సహకరించని ఐరోపా దేశాలపై కఠిన వైఖరి అవలంబించేందుకు అమెరికా యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో భాగంగా నాటో కూటమికి అందిస్తున్న సైనిక సహకారాన్ని తగ్గించే ప్రతిపాదనలను ట్రంప్ యంత్రాంగం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం, ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం మోహరించిన యుద్ధ విమానాలు, నిఘా వనరులు, నౌకాదళ సామగ్రిలో గణనీయమైన కోతలు విధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎఫ్–16, ఎఫ్–15ఈ యుద్ధ విమానాల సంఖ్యను 150 నుంచి 100కు తగ్గించే యోచనలో ఉన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. అలాగే సముద్ర నిఘా విమానాల ను 26 నుంచి 15కు కుదించే అవకాశం ఉందని సమాచారం. అదేవిధంగా ఐరోపాలో ఉన్న ఎనిమిది రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ విమానాలను కూడా ఉపసంహరించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. విమాన వాహక నౌక, జలాంతర్గాము లతో పాటు నాటో కార్యకలాపాల్లో కీలకంగా ఉపయోగిస్తున్న మరికొన్ని నౌకలు, విమానాలను ఇతర ప్రాంతాలకు తరలించే అంశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో మిత్ర దేశాల భద్రత కోసం కేటాయించిన రెండు బాంబర్ గ్రూపుల్లో ఒకదానిని కూడా ఇతర ప్రాంతానికి మళ్లించే యోచన ఉన్నట్లు సమాచారం.

**అధికారంగా స్పందించని రక్షణశాఖ**

ఈ ప్రతిపాదనలు అమలైతే సుదూర దాడులు, వైమానిక మద్దతు, నిఘా కార్యకలాపాల విషయంలో నాటో సామర్థ్యాలు గణనీయంగా పరిమితం కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు అమెరికా రక్షణశాఖ గానీ, నాటో అధికార వర్గాలు గానీ అధికారికంగా స్పందించలేదు. కాగా నాటోకు అందిస్తున్న సహకారంలో కొన్ని మార్పులు, సర్దుబాట్లు ఉండవచ్చని గతవారం అమెరికా ఈస్టర్న్ కమాండ్ పేర్కొనడం గమనార్హం. ఇరాన్–సంబంధిత ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి భద్రత కోసం కలిసి పనిచేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన పిలుపునకు ఐరోపా దేశాలు ఆశించిన స్థాయిలో స్పందించకపోవడం కూడా ఈ పరిణామాలకు కారణమై ఉండవచ్చని అంతర్జాతీయ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలోనూ ట్రంప్ నాటోపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అవసరమైతే కూటమి నుంచి వైదొలిగే అంశాన్ని ప్రస్తావించారు. నాటోను కాగితపు పులిగా అభివర్ణిస్తూ తీవ్ర వ్యాఖ్యలు కూడా చేసిన విషయం తెలిసిందే.

## భారత నౌకలపై దాడి ఇరాన్ పనే..

ఒమన్ తీర ప్రాంతంలో భారతీయులు ఉన్న నౌకలపై ఇటీవల జరిగిన దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులకు ఇరాన్ బాధ్యత వహించాలని ఆరోపించిన ఆయన, అమెరికా బలగాలే వాటిని అడ్డుకున్నాయని తెలిపారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, భారతీయులు ప్రయాణిస్తున్న నౌకలపై దాడులు ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కావని పేర్కొన్నారు. సముద్ర మార్గాల్లో భద్రతకు భంగం కలిగించే చర్యలను అమెరికా తీవ్రంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా ఇరాన్‌పై మరోసారి విమర్శలు గుప్పించిన ట్రంప్, అమెరికాతో ఒప్పందం కుదిరిందంటూ ఆ దేశం తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇరాన్ నాయకత్వానికి నిజాయతీ లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో వారితో సానుకూల ఒప్పందం కుదరడం కష్టమని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వేదికలపై బాధ్యతాయుత వైఖరిని అవలంబించాలని ఇరాన్‌ను హెచ్చరించారు. కాగా, గత నాలుగు రోజుల వ్యవధిలో ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకలపై మూడు దాడులు జరిగినట్లు సమాచారం. ఈ ఘటనల్లో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడుల నేపథ్యంలో ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ నౌకాయాన రక్షణ అంశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



# పెట్రోల్ బంకులపై కేంద్రం ఆంక్షలు

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు
- ముడిచమురు సరఫరాలో అంతరాయయే కారణం

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు ంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్ప డింది. దీన్ని అరికట్టేందుకు ంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# యూన్ సుక్ యేల్‌కు 30 ఏళ్ల జైలు

- ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపిన కేసులో దోషిగా తేలిన మాజీ అధ్యక్షుడు
- కిమ్ పాలనను రెచ్చగొట్టి అత్యవసర పరిస్థితి సృష్టించాలన్న కుట్రగా కోర్టు వ్యాఖ్య
- మాజీ రక్షణ మంత్రి సహా పలువురికి జైలు శిక్ష



**సియోల్:** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే మార్షల్ లా విధించిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆయనకు, ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపిన కేసులో అదనంగా 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ దక్షిణ కొరియా కోర్టు తీర్పు వెలువరించింది. 2024 అక్టోబర్‌లో ఉత్తర కొరియాలోకి డ్రోన్లను పంపాలని యూన్ ఆదేశించినట్లు కోర్టు నిర్ధారిం చింది. కిమ్ జోంగ్ ఉన్ పాలనను రెచ్చగొట్టి అత్యవసర పరిస్థితిని సృష్టించడమే ఈ చర్యల వెనుక ఉద్దేశమని పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన నియంత్రణలోకి తెచ్చుకోవడం, రాజకీయ ప్రత్యర్థులను అరెస్టు చేయడం, అధిక అధికారాలు చెలాయించేందుకు విధించిన మార్షల్ లా విఫలమైన తర్వాత దానికి సమరనగా ఈ చర్యలకు పాల్పడినట్లు కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసులో యూన్‌తో పాటు మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యూంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్ మాజీ అధిపతి కిమ్ యోంగ్–డేలను కూడా కోర్టు దోషులుగా నిర్ధారించి జైలు శిక్షలు విధించింది. ఉత్తర కొరియాను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి దేశంలో అత్యవసర పరిస్థితి సృష్టించేందుకు సైనిక చర్యలను ముసుగుగా ఉపయోగించారని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే, ఉత్తర కొరియా తరచూ చెత్త బెలూన్లను తమ దేశంపై ప్రయోగిస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తోందని, వాటికి ప్రతిస్పందనగానే డ్రోన్లను పంపినట్లు యూన్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. కాగా, 2024 డిసెంబరులో ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయం టూ యూన్ సుక్ యేల్ దేశంలో మార్షల్ లా ప్రకటించారు. అయితే తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తం కావడంతో గంటల వ్యవధిలోనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అనంతరం అభిశంసనకు గురై అధ్యక్ష పదవిని కోల్పోయిన యూన్ ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు.

# అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదు

- పాశ్చాత్య దేశాలవి ద్వంద్వ ప్రమాణాలు
- రష్యాతో చమురు కోనుగోళ్లను సమర్థించిన జైశంకర్



**న్యూఢిల్లీ :** పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని డా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని డా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల డ్రాయిల్‌ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు.ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానులంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణా మాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణి జ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమ దేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నిం చారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

# మెడికల్ సీట్ల పేరుతో మోసం

- విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల్లో వసూలు
- మహారాష్ట్రలో 40 మందికి పైగా బాధితులు
- పోలీసుల అదుపులో నిందితుడు
- హైదరాబాద్, ముంబైలో ఆరు కేసులు

**ప్రజానావ, ముంబై:** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు ఇప్పిస్తామని నమ్మించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన అరవింద్ ప్రకాష్ కుమార్ అరోగొండ (47)ను యెరవాడ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 మంది విద్యార్థులు, తల్లిదండ్రులను నిందితుడు మోసగించినట్లు విచారణలో వెల్లడైంది. మెడికల్ సీట్లు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నప్పటికీ ప్రవేశాలు కల్పించకపోవడంతో పాటు బాధితులకు సొమ్ము తిరిగి చెల్లించలేదని పోలీసులు తెలిపారు. నిందితుడిపై హైదరాబాద్, ముంబై నగరాల్లో ఇప్పటికే ఆరు మోసం కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రూ.2 లక్షలకు మైనర్ బాలిక విక్రయం

- బాల్య వివాహం జరిపించి నెల రోజులు లైంగిక దాడి
- భర్త సహా 10 మంది అరెస్ట్, పోక్సో చట్టం కింద కేసు

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా హర్సుల్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికను అపహరించి రూ.2 లక్షలకు విక్రయించిన అంతర్–జిల్లా ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్, కొత్త బట్టలు కొనిపెడతామంటూ బాలికను తీసుకెళ్లిన నిందితులు అహల్యానగర్ జిల్లా సంగమ్నేర్ తాలూకాలో ఆమెకు బాల్యవివాహం జరిపించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలిక అదృశ్యంపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో బాలికను గుర్తించి రక్షించారు. ఈ కేసులో బాలిక భర్తతో పాటు మొత్తం 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో బాలికపై నెల రోజుల పాటు లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ కావడంతో భర్తపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివాహాల పేరుతో బాలికలను విక్రయిస్తున్న ముఠా కార్యకలాపాలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శుక్రవారం ఎయిర్ ఇండియా ఏఐ–171 విమాన ప్రమాద మృతులకు కన్నీటి నివాళులర్పిస్తున్న బంధువులు

# విమానయాన భద్రతను బలోపేతం చేస్తాం

- త్వరలో అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై తుది నివేదిక
- ఈ ఘటనకు సంబంధించి ఎవరూ తప్పుడు ప్రచారాలు చేయొద్దు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదానికి ఏడాది పూర్తయిన సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పందించారు. జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రమాదంపై నిష్పక్షపాత దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల అసలు కారణాలను సమగ్రంగా గుర్తించేందుకు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. దర్యాప్తు తుది దశకు చేరుకుందని, త్వరలో తుది నివేదిక విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. నివేదికలోని అంశాల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విమానయాన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, ప్రమాదంపై దర్యాప్తు చేపడుతున్న ఏఏఐబీ కూడా కీలక ప్రకటన చేసింది. అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపుల ప్రక్రియ పూర్తయిన అనంతరం తుది నివేదికను విడుదల చేస్తామని వెల్లడించింది. ప్రమాదానికి కారణాలను గుర్తించేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటి వరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రాథమికంగా గుర్తించిన అంశా లను నిర్ధారించేందుకు మరిన్ని పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొంది.

# ప్రేమ, పెళ్లిపేరుతో కుచ్చుటోపీ

- 25 మందికి పైగా మహిళలను మోసం చేసిన కేటుగాడు
- పోలీసుల అదుపులో నిత్య పెళ్లి కొడుకు
- రూ.20 లక్షల విలువైన కారు, నకిలీ పత్రాలు స్వాధీనం

**ప్రజానావ, ముంబై:** వివాహ ప్రకటనలు, మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల ద్వారా మహిళలను ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి కోట్ల రూపాయలు కాజేసిన నిత్య పెళ్లికొడుకు అనుజ్ కుమార్ చంద్రప్రకాష్ త్రివేదిని మీరా–భయందర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గ్రేటర్ నోయిడాలో అరెస్టు చేశారు. అజయ్ అగర్వాల్, అజయ్ సంతోష్ సింగ్, జయప్రకాష్ గుప్తా తదితర నకిలీ పేర్లతో 25 మందికి పైగా మహిళలను మోసగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మీరా రోడ్‌కు చెందిన ఓ మహిళ నుంచి రూ.97 లక్షలు, అమరావతికి చెందిన మరో మహిళ నుంచి రూ.25 లక్షలు కాజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.20 లక్షల విలువైన కారు, నకిలీ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసాల్లో అతని కుమారుడు కూడా పాలుపంచుకున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని సహ నిందితుడిగా చేర్చి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# గంజాయి స్మగ్లింగ్ చేస్తూ మోడల్ అరెస్ట్

- బ్యాంకాక్ నుంచి ముంబయికి 11 కిలోల గంజాయి తరలింపు
- స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.11.82 కోట్లు



**ముంబై:** మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతూ ఓ యువ మోడల్ ముంబై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు చిక్కింది. బ్యాంకాక్ నుంచి భారీ మొత్తంలో గంజాయిని తరలిస్తూ వచ్చిన కేరళకు చెందిన 28 ఏళ్ల హర్ష సన్నీని అధికారులు అరెస్టు చేశారు. అధికారుల వివరాల ప్రకారం, హర్ష సన్నీ బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ), కస్టమ్స్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆమె ట్రాలీ బ్యాగ్‌ను పరిశీలించగా 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు లభించాయి. వాటిలో ఆకుపచ్చ రంగు పదార్థం ఉండటంతో నార్కోటిక్ పరీక్షలు నిర్వహించగా అది గంజాయి అని నిర్ధారణ అయింది. స్వాధీనం చేసుకున్న గంజాయి మొత్తం బరువు 11 కిలోలుగా ఉండగా, అంతర్జాతీయ మార్కెట్‌లో దాని విలువ సుమారు రూ.11.82 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. దీంతో నిషేధిత మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసు నమోదు చేసి హర్ష సన్నీని అరెస్టు చేశారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని ఆదేశించింది. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను దేశంలోని ఏ ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించారనే కోణంలో అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా హర్ష సన్నీ 2025లో జరిగిన మిసెస్ కేరళ పోటీల్లో పాల్గొన్న పోటీదారుగా గుర్తింపు పొందినట్లు సమాచారం.

# స్టాక్ మార్కెట్‌లో నష్టాలు

**కుటుంబం సహా హెడ్మాస్టర్ ఆత్మహత్య**

**ప్రజానావ, ముంబై:** స్టాక్ మార్కెట్‌లో కోటి రూపాయలకు పైగా నష్టపోయిన ఓ హెడ్మాస్టర్ తన భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి హత్య చేసి అనంతరం ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా హట్టిడ్ గ్రామంలో చోటుచేసుకుంది. ఐస్‌క్రీమ్‌లో విషం కలిపి కుటుంబ సభ్యులకు ఇచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రాథమిక విచారణలో భారీ ఆర్థిక నష్టం, తీవ్ర మానసిక ఒత్తిడే ఈ దారుణానికి కారణమై ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

**ఇద్దరు నిందితుల అరెస్ట్**

**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవ త్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదే శ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొం దరు గుర్తు తెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసి రారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతిం ది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమా చారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు గాయాలేమీ కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు

- 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికిన కివీస్ దిగ్గజం
- మూడు ఫార్మాట్లలో 19వేలకుపైగా పరుగులు, 48 సెంచరీలు



**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ జరుగుతున్న సమయంలోనే 35ఏళ్ల ఈ దిగ్గజ ఆటగాడు తన నిర్ణయాన్ని వెల్లడించడం విశేషం. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమ్సన్ 16ఏళ్ల కెరీర్‌లో న్యూజిలాండ్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం మూడు ఫార్మాట్లలో 19 వేలకుపైగా పరుగులు సాధించిన అతడు 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు నమోదు చేశాడు. గత ఏడాది టీ20లకు వీడ్కోలు పలికిన కేన్, తాజాగా టెస్టులు, వన్డేలకూ గుడ్‌బై చెప్పాడు. 2016 నుంచి 2024 వరకు దాదాపు ఎనిమిదేళ్లపాటు న్యూజిలాండ్‌కు సారథ్యం వహించిన విలియమ్సన్, రెండు సార్లు జట్టును ఐసీసీ వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేర్చాడు. తొలి ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను న్యూజిలాండ్ సాధించడంలో ఆయన నాయకత్వం కీలకపాత్ర పోషించింది. వీడ్కోలు సందర్భంగా కేన్ భావోద్వేగంగా స్పందించాడు. న్యూజిలాండ్ తరఫున ఆడిన ప్రతి మ్యాచ్‌లో తన అత్యుత్తమ ప్రతిభను కనబర్చేందుకు ప్రయత్నించానని, జట్టుకు నాయకత్వం వహించడం గర్వకారణమని పేర్కొన్నాడు. ఇన్నేళ్లు జాతీయ జట్టులో భాగమవడం తన అదృష్టమని చెప్పాడు.

### ఎస్‌ఆర్‌హెచ్‌తో ప్రత్యేక అనుబంధం

కేన్ విలియమ్సన్ తెలుగు క్రికెట్ అభిమానులకు కూడా ఎంతో సుపరిచితుడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించిన ఆయన, జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2016లో ఐపీఎల్ టైటిల్ గెలిచిన ఎస్‌ఆర్‌హెచ్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. తెలుగు అభిమానులు ప్రేమగా 'కేన్ మామ'గా పిలిచే విలియమ్సన్, ఐపీఎల్‌లో 79 మ్యాచ్‌లు ఆడి 2,128 పరుగులు చేశాడు. ఇదిలాఉంటే ప్రత్యర్థులను గౌరవించడం, మైదానంలో ప్రశాంత స్వభావంతో వ్యవహరించడం కేన్ విలియమ్సన్ ప్రత్యేకత. కెరీర్ మొత్తంలో వివాదాలకు దూరంగా ఉన్న ఆయన, క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా నిలిచాడు. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో అండర్-19 రోజుల నుంచే స్నేహం కొనసాగిస్తుండటం విశేషం.







# రోహిత్‌కు పరీక్ష!

- అఫ్ఘానిస్థాన్‌తో నేడు తొలి వన్డే
- తెలుగు కుర్రాడు నితీశ్‌పైనా ప్రత్యేక దృష్టి

**ధర్మశాల:** 2027 వన్డే ప్రపంచకప్‌కు జట్టు నిర్మాణ ప్రక్రియలో భాగంగా టీమ్‌ఇండియా అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగనుంది. ధర్మశాల వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నప్పటికీ, జట్టు మేనేజ్‌మెంట్ దృష్టి ప్రధానంగా ఆటగాళ్ల ప్రదర్శనలపైనే ఉంది. సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫిట్‌నెస్, ఫామ్‌పై ఈ సిరీస్‌లో ప్రత్యేక నిఘా ఉండనుంది. వచ్చే ప్రపంచకప్ వరకు అతడు కొనసాగగలడా అనే అంశంపై ఈ సిరీస్ కీలకంగా మారనుంది. శుభ్‌మన్ గిల్‌తో కలిసి రోహిత్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. విరాట్ కోహ్లీ గాయం కారణంగా సిరీస్‌కు దూరం కావడంతో తొలి వన్డేలో కేఎల్ రాహుల్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశముంది. ఇషాన్ కిషన్ వికెట్‌కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం ఉంది. శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో ఆడనున్నాడు.

### నితీశ్‌కు కీలకం

గాయపడిన హార్దిక్ పాండ్య స్థానంలో అవకాశమందుకున్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ప్రదర్శనపై కూడా ఆసక్తి నెలకొంది. వన్డే జట్టులో స్థానం నిలబెట్టుకునేందుకు ఈ సిరీస్ అతడికి కీలకంగా మారనుంది. సీనియర్ పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వడంతో అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ కొత్త బంతిని పంచుకోనున్నారు.




# దిగ్గజ షూటర్, కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

- అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- సంతాపం తెలిపిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** భారత షూటింగ్ దిగ్గజం, ప్రముఖ కోచ్ జస్పాల్ రాణా (49) గురువారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఇటీవల ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్ అనంతరం జర్మనీ నుంచి తిరిగి వస్తుండగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఛాతినొప్పితో బాధపడుతున్న రాణాను ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఆర్‌ఏఐ) ధ్రువీకరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన మనుబాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు గెలిచిన ఆయన, జాతీయ జూనియర్ కోచ్‌గా పనిచేస్తూ మను బాకర్, సౌరభ్ చౌదరి వంటి ప్రతిభావంతులైన షూటర్లను తీర్చిదిద్దారు. గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ జట్టుకు 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హైపర్‌ఫార్మెన్స్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారత క్రీడా రంగానికి ఆయన మరణం తీరనిలోటని, యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన సేవలు చిరస్మరణీయమని ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు.

# సింధు సూపర్ షో

- ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్‌లోకి దూసుకెళ్లిన తెలుగుతేజం
- చైనా షట్లర్‌పై ఏకపక్ష విజయం



**సిడ్నీ:** భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 టోర్నీలో అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో చైనాకు చెందిన చెన్ సుయుపై ఏకపక్ష ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 21-6, 21-9 తేడాతో ఘన విజయం సాధించింది. కేవలం 31 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు ప్రత్యర్థికి ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. తొలి గేమ్‌ను 21-6తో సునాయాసంగా గెలుచుకున్న ఆమె, రెండో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించి 21-9తో మ్యాచ్‌ను ముగించింది. ఈ విజయంతో సింధు ఈ ఏడాది తన తొలి టైటిల్‌కు మరో రెండు విజయాల దూరంలో నిలిచింది. ప్రస్తుత సీజన్‌లో పలు ఒడిదొడుకులు ఎదుర్కొన్న సింధుకు ఇది విశేష ఊరటనిచ్చే ఫలితంగా నిలిచింది. ఈ ఏడాది ఆమె ఆడిన ఎనిమిది బీడబ్ల్యూఎఫ్ టోర్నీల్లో ఇది రెండో సెమీఫైనల్ కావడం విశేషం. అంతకుముందు ప్రీక్వార్టర్‌లో భారత క్రీడాకారిణి ఈశారాణి బారువాను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన సింధు, ఇప్పుడు మరో మెరుగైన ప్రదర్శనతో టైటిల్ వేటను కొనసాగిస్తోంది.

# మెక్సికో శుభారంభం

- తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 2-0 తేడాతో విజయం
- ముగ్గురు ఆటగాళ్లకు రెడ్‌కార్డ్ • మ్యాచ్ రిఫరీపై అభిమానుల ఆగ్రహం
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు




**మెక్సికోసిటీ/గ్వాడలజారా:** ఫిఫా ప్రపంచకప్-2026 టోర్నీలో ఆతిథ్య జట్టు మెక్సికో విజయంతో శుభారంభం చేసింది. గురువారం జరిగిన గ్రూప్-ఏ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 2-0 తేడాతో గెలుపొందింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన మెక్సికో, 9వ నిమిషంలోనే ఆధిక్యంలోకి వెళ్లింది. దక్షిణాఫ్రికా గోల్‌కీపర్ రోన్వెన్ విలియమ్స్ చేసిన పొరపాటును మెక్సికో మిడ్‌ఫీల్డర్ ఎరిక్ లిరా చాకచక్యంగా వినియోగించుకున్నాడు. అతను అందించిన పాస్‌ను జూలియన్ క్వినోనెస్ గోల్‌గా మలిచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండార్థంలో కూడా మెక్సికో ఆధిపత్యం కొనసాగింది. 67వ నిమిషంలో రాబర్టో అల్వారాడో ఇచ్చిన క్రాస్‌ను రౌల్ హిమెనెజ్ అద్భుతమైన హెడర్‌తో గోల్‌గా మలిచి జట్టు ఆధిక్యాన్ని 2-0 కు పెంచాడు. 35 ఏళ్ల హిమెనెజ్ ప్రపంచకప్ చరిత్రలో గోల్ సాధించిన అత్యంత వయోవృద్ధ ఆటగాళ్లలో ఒకరిగా నిలిచాడు.

### విల్టన్ సాంపియోపై విమర్శల వెల్లువ

ఈ మ్యాచ్‌లో రిఫరీగా వ్యవహరించిన విల్టన్ సాంపియో నిర్ణయాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకే మ్యాచ్‌లో మూడు రెడ్‌కార్డులు చూపించి వార్తల్లో నిలిచిన ఆయనపై అభిమానులు సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికా పరాజయానికి ఆయన నిర్ణయాలే కారణమంటూ, వ్యంగ్యంగా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు కూడా ఆయనకే ఇవ్వాలంటూ పోస్టులు చేశారు. మీమ్స్‌తో సోషల్ మీడియాను హోరెత్తించారు. దక్షిణాఫ్రికా జట్టుకు చెందిన ఇద్దరు ఆటగాళ్లకు నేరుగా రెడ్‌కార్డులు రావడంతో ఆ జట్టు చాలా సమయం పాటు కేవలం తొమ్మిది మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. 2022 ప్రపంచకప్‌లో మొత్తం టోర్నీ అంతటా నాలుగు రెడ్‌కార్డులు మాత్రమే నమోదవగా, ఈసారి తొలి మ్యాచ్‌లోనే మూడు రెడ్‌కార్డులు రావడం విశేషంగా మారింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఒకే మ్యాచ్‌లో ఇన్ని రెడ్‌కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

### చెకియా పొరపాట్లు.. కొరియా గెలుపు

ఫిఫా ప్రపంచకప్-2026లో ఆసియా జట్టు దక్షిణ కొరియా విజయంతో శుభారంభం చేసింది. గ్రూప్-ఏలో జరిగిన మ్యాచ్‌లో చెకియాపై 2-1 తేడాతో గెలుపొందింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో దక్షిణ కొరియా రెండార్థంలో మెరుగైన ఆటతీరుతో విజయాన్ని అందుకుంది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో మొదటి 45 నిమిషాలు గోల్స్ లేకుండానే ముగిశాయి. అయితే రెండార్థం ప్రారంభమైన కొద్ది సేపటికే చెకియా ఆధిక్యంలోకి వెళ్లింది. 59వ నిమిషంలో లాడిస్లావ్ గోల్ సాధించి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తరువాత దూకుడు పెంచిన దక్షిణ కొరియా 67వ నిమిషంలో హ్వాంగ్ బోయం గోల్‌తో స్కోరును సమం చేసింది. దీంతో మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారింది. ఇరు జట్లు గెలుపు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన వేళ, 80వ నిమిషంలో ఓ హ్యోన్-గ్యు అద్భుతమైన గోల్‌తో దక్షిణ కొరియాను 2-1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. అదనపు సమయంలో చెకియా నుంచి వచ్చిన దాడులను సమర్థంగా అడ్డుకున్న కొరియా ఆటగాళ్లు ప్రత్యర్థికి మరో గోల్ చేసే అవకాశమివ్వలేదు. మ్యాచ్ మొత్తంలో చెకియా ఆటగాళ్లు 16 తప్పిదాలు చేయగా, దక్షిణ కొరియా కేవలం తొమ్మిది పొరపాట్లకే పరిమితమైంది.



Business
బిజినెస్

# మెటా సేవలకు అంతరాయం

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, మెసెంజర్, థ్రెడ్స్ సేవలు ప్రభావితం




**న్యూఢిల్లీ:** మెటా ఆధ్వర్యంలోని ప్రముఖ సోషల్ మీడియా, మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌ల సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, మెసెంజర్, థ్రెడ్స్ యాప్‌ల వినియోగదారులు వివిధ సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఫీడ్‌లు లోడ్ కాకపోవడం, సందేశాలు పంపడంలో ఆటంకాలు ఏర్పడటం, లాగిన్ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తడం వంటి సమస్యలను యూజర్లు ఎదుర్కొంటున్నారు. భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల వినియోగదారులు ఈ అంతరాయంపై సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు చేస్తున్నారు. మెటా సేవల్లో అంతరాయం కారణంగా లక్షలాది మంది వినియోగదారులు ప్రభావితమైనట్లు తెలుస్తోంది. అయితే, ఈ సాంకేతిక సమస్యలకు గల కారణాలపై మెటా సంస్థ ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. సేవల పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు సమాచారం వెలువడలేదు.

# మళ్లీ పెరిగిన ద్రవ్యోల్బణం

- మేలో 3.93 శాతానికి చేరిన రిటైల్ ద్రవ్యోల్బణం
- ఆహారం, ఇంధన ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం
- వృద్ధి అంచనాలు తగ్గించిన ఆర్‌బీఐ.. ద్రవ్యోల్బణ అంచనాలు పెంపు



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భారత్‌తో పాటు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై స్పష్టంగా కనిపిస్తోంది. ఆహార పదార్థాలు, ఇంధన ధరలు పెరగడంతో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మే నెలలో 3.93 శాతానికి చేరింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఏప్రిల్‌లో 3.48 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం నెలరోజుల్లోనే గణనీయంగా పెరిగింది. అయితే, ఇది ఇంకా ఆర్‌బీఐ నిర్దేశించిన మధ్యకాలిక లక్ష్య పరిధిలోనే ఉంది. వినియోగదారుల జీవనశైలిలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ధరల సూచీ లెక్కింపులో కేంద్రం ఈ ఏడాది ప్రారంభంలో సవరణలు చేపట్టింది. ఆ కొత్త గణాంకాల ప్రకారం మే నెలలోనే అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైంది. ఆహార ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.20 శాతంగా ఉండగా, మేలో 4.78 శాతానికి పెరిగింది. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో కొనసాగుతున్న అంతరాయాలు చమురు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడంతో రవాణా వ్యయాలు అధికమయ్యాయి. దీంతో మే నెలలో రవాణా ద్రవ్యోల్బణం 1.75 శాతానికి చేరింది.

### ఆర్‌బీఐ ఆందోళన

ధరల పెరుగుదలపై ఇటీవల భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇంధన ధరల పెరుగుదల, సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది. రవాణా వ్యయాల పెరుగుదల ఎగుమతులకు కూడా సవాల్‌గా మారుతోందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. అదే సమయంలో రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది.




**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ అమెరికా స్టాక్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. రాకెట్ తయారీ సంస్థ షేర్లు నాస్‌డాక్‌లో రాకెట్‌లా దూసుకెళ్లాయి. ఐపీఓలో భాగంగా ఒక్కో షేరు ఇష్యూ ధర 135 డాలర్లు కాగా.. 150 డాలర్ల వద్ద లిస్టయి.. ప్రస్తుతం 164 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఆ మేర ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిసింది.**

# మార్కెట్లలో జోష్

- భారీ లాభాల్లో ముగిసిన సూచీలు
- రూ.9.7 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

**ముంబై:** అమెరికా-ఇరాన్ మధ్య త్వరలో శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం దేశీయ స్టాక్ మార్కెట్లకు ఊతమిచ్చాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో శుక్రవారం దేశీయ సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,700 పాయింట్లకు పైగా ఎగబాకగా, నిఫ్టీ 23,600 పాయింట్ల ఎగువన ముగిసింది. రోజంతా కొనుగోళ్ల జోరుతో బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,695.40 పాయింట్లు ఎగిసి 75,527.95 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 75,608.02 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 461.30 పాయింట్లు లాభపడి 23,622.90 వద్ద ముగిసింది. ఈ ర్యాలీతో బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.462.05 లక్షల కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్, ఎల్ అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడగా.. టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు మాత్రమే నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ధర ఔన్సుకు 4,224 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది.

# త్వరలో రాజకీయాల్లోకి వస్తా




ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకు డు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై కొం తకా లంగా జరుగుతున్న ప్రచారానికి ఆయన స్వయం గా స్పందించారు. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడిం చిన లారెన్స్, తుది నిర్ణయం మాత్రం ప్రజల అభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా విడుద ల చేసిన వీడియోలో లారెన్స్ మాట్లాడుతూ, రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన తనకు మొదట్లో లేదన్నారు. పదవి, అధికారం లేదా డబ్బు కోసం రాజకీయాల్లోకి రావడం తన లక్ష్యం కాదని స్పష్టం చేశారు. అయితే కొన్ని పరిస్థితులు, సంఘటనలు తనలో రాజకీయా లపై ఆసక్తి పెంచాయని పేర్కొన్నారు. నా నిర్ణయానికి నా తల్లి కూడా అంగీకరించారు. ఇప్పుడు ప్రజలు, అభిమానులు ఏమి కోరుకుంటు న్నారో తెలుసుకోవాలనుకుంటు న్నాను. వారు ఆమోదిస్తే రాజకీయ ప్రయా ణాన్ని ప్రారంభి స్తాను. ఒకవేళ ప్రజలు సాను కూలంగా స్పందించ కపోతే, ఇప్పటివరకు చేస్తున్నట్లుగానే సమాజ సేవను కొనసాగి స్తాను అని లారెన్స్ తెలిపారు. అలాగే, ఏ రాజకీయ పార్టీలో చేరతానో, ఎప్పుడు రాజ కీయాల్లోకి అడుగుపెడతానో సరైన సమ యంలో ప్రకటిస్తానని చెప్పారు. ఈ నేపథ్యం లో తిరుచ్చి ఈస్ట్ ఉపఎన్నికల్లో లారెన్స్ పోటీ చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ కొన సాగుతోంది. ఇటీవల ఒక కార్యక్రమంలో తమిళ నాడు ముఖ్య మంత్రి విజయ్‌తో తన అనుబంధం గురించి కూడా లారెన్స్ మాట్లా డారు. సినీ పరిశ్ర మలో తనకు అత్యంత సన్నిహిత స్నేహితుడు విజయ్ మాత్రమేనని, తన జీవితంలో ఏ సంఘ టన జరిగినా ముందుగా ఫోన్ చేసి ఆరా తీసేది ఆయనేనని పేర్కొన్నారు. దీంతో రాఘవ లారెన్స్ రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొనగా, ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై అభిమా నులు, రాజకీయ వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

# జైలర్-2లో హృతిక్ రోషన్?

## రజినీతో స్క్రీన్ షేర్‌పై ఆసక్తికర చర్చ!





సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్–ఇండియా చిత్రం 'జైలర్ 2'పై మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ కామియో పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో షారుఖ్ ఖాన్ అతిథి పాత్రపై ప్రచారం జరిగినప్పటికీ, ఇప్పుడు హృతిక్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, రజినీకాంత్–హృతిక్ రోషన్ ఒకే తెరపై కనిపించడం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. హృతిక్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను ఈ నెల 22, 23 తేదీల్లో చెన్నైలో చిత్రీకరించే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, ఎస్.జె. సూర్య, మోహన్ లాల్, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, యోగి బాబు తదిత రులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'జైలర్ 2' ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముం దుకు రానుంది.



# 'రావు బహదూర్'పై సత్యదేవ్ ధీమా!



సత్యదేవ్ కథానాయకుడిగా, వెంకటేశ్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రావు బహదూర్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. వికాస్ ముప్పాల, దీపా థామస్, బాల పరాశర్, ఆనంద్ భారతి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మిస్తున్నారు. అగ్ర కథానాయకుడు మహేష్ బాబు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో సత్యదేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఈ ఏడాది జులై 3 ప్రత్యేకమైన రోజు అవుతుంది. 'రావు బహదూర్' విడుదలైన తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి మరో విశిష్టమైన సినిమా వచ్చిందని అందరూ మాట్లాడుకుంటారు. మంచి సినిమాను ఆదరించే తెలుగు ప్రేక్షకుల మద్దతుతో ఈ చిత్రం ఇతర భాషల ప్రేక్షకుల దృష్టినీ ఆకర్షిస్తుంది. దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ సినిమా గురించి చర్చ జరుగుతుందని నమ్ముతున్నాను'' అని సత్యదేవ్ అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మహా ఈ కథను అత్యంత నిబద్ధతతో తెరకెక్కించారని, ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేలా సినిమా ఉంటుందని చెప్పారు. చిత్రంలో ఉపయోగించిన వస్త్రాలు, సెట్స్, సాంకేతిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని, కొన్ని దుస్తులను ప్రత్యేకంగా సేకరించి వినియోగించినట్లు వెల్లడించారు. నిర్మాత అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ, సినిమా నిర్మాణానికి సంబంధించిన అన్ని పనులు పూర్తయిన అనంతరం మహేశ్‌బాబుకు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతంలో 'మేజర్' చిత్రానికి కూడా ఇదే విధంగా ప్రివ్యూ చూపించామని, ఈ చిత్రానికి కూడా ఆయన మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మా ఇంటి బంగారం

# రన్‌టైమ్ ఫిక్స్!

### సమంత మూవీ 2 గంటల 34 నిమిషాలు!

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఫ్యామిలీ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' విడుదలకు సిద్ధమవుతోంది. వైవిధ్యమైన చిత్రాల దర్శకురాలు నందినీరెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాకు 'యూ/ఏ' సర్టిఫికెట్ లభించింది. తాజాగా చిత్ర రన్‌టైమ్‌ను 154 నిమిషాలు (2 గంటల 34 నిమిషాలు)గా ఖరారు చేసినట్లు సమాచారం. కథా నేపథ్యం, భావోద్వేగాలకు అనుగుణంగా ఈ నిడివిని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గతంలో సమంత–నందిని రెడ్డి కాంబినేషన్‌లో వచ్చిన ఓ బేబీ మంచి విజయాన్ని అందుకోవడంతో, 'మా ఇంటి బంగారం'పై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి, శ్రీముఖి, అంజలి మరియు సత్యరాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందిస్తుండగా, సమంత తన సొంత నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





## నాని కొత్త సినిమాలో..

# రుక్మిణి వసంత్!

'సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' వంటి చిత్రాలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న నటి రుక్మిణి వసంత్‌కు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇప్పటికే యశ్ నటిస్తున్న 'టాక్సిక్', ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' వంటి భారీ ప్రాజెక్టుల్లో నటిస్తున్న ఆమె, ఇప్పుడు మరో తెలుగు చిత్రంలో నటించే అవకాశమున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. న్యాచురల్ స్టార్ నాని సొంత నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై రూపొందనున్న కొత్త చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం రుక్మిణి వసంత్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. 'దండోరా' చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు మురళీకాంత్ ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. కథానాయకుడి ఎంపిక ప్రక్రియ కూడా జరుగుతోందని, హీరో ఖరారైన వెంటనే చిత్రాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పలు భాషల్లో తన ప్రతిభను నిరూపించుకున్న రుక్మిణి వసంత్, ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే తెలుగులో ఆమెకు మరో ఆసక్తికరమైన అవకాశం దక్కినట్లే అవుతుంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# 'సోగ్గాడే' సీక్వెల్‌కు తాత్కాలిక బ్రేక్?



కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ సినిమాపై ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నాగార్జున భావిస్తున్నట్లు సమాచారం. దీంతో గతంలో ప్రకటించిన 'సోగ్గాడే చిన్ని నాయన' సీక్వెల్ ప్రాజెక్ట్‌ను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. యువ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం క్రైమ్ అండ్ మనీ హీస్ట్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. ఇప్పటికే షూటింగ్‌లో సగానికి పైగా భాగం పూర్తయినట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత నాగార్జున సరసన టబు నటిస్తుండగా, సంగీత బాధ్యతలను దేవిశ్రీ ప్రసాద్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది రెండో అర్ధభాగంలో పలు భారీ పాన్–ఇండియా చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండటంతో, వాటి మధ్య పోటీకి వెళ్లడం కంటే సంక్రాంతి సీజన్‌ను టార్గెట్ చేయడమే సరైన నిర్ణయంగా నాగార్జున భావిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. తేకాకుండా, ఈ చిత్రంలో నాగార్జున విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారని, కొన్ని సన్నివేశాల కోసం ఆధునిక 'డీ–ఏజింగ్' టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు సమాచారం. చిత్రానికి సంబంధించిన తొలి టీజర్‌ను దసరా సందర్భంగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277